కథ

# తెలుసుకోనవె చెల్లీ...

''హలో..వినత గారేనా మాట్లాడుతున్నది?''

''అవును...మీరు?''

''మిమ్మల్ని చూడకముందు నేనెవరో నాకు తెలిసేది..ఇప్పుడు నేనెవరని అడిగితే ఏం చెప్పను?''

''వాట్? వాట్ ఆర్ యూ టాకింగ్?'' నొసలు చిట్లించింది వినత.

''ప్లీజ్..అలా చిరాగ్గా నొసలు చిట్లించకండి..నేను తట్టుకోలేను'' ఆశ్చర్యం, నవ్వు వచ్చాయామెకి. ఆసక్తిగా కూడా అనిపించింది.

''ఇంతకీ మీరెవరు?''

''గత కొద్ది నెలలుగా మౌనంగా మిమ్మల్ని ఆరాధిస్తున్న వాడిని- మీ ప్రతి కదలికా పరిశీలిస్తున్న వాడిని- మీ ఊహలనే జీవితంగా చేసుకుని జీవిస్తున్న వాడిని- ఏనాటికైనా నా మనస్సు మీకు చెప్పి మీతో కలిసి బ్రతికే వరం పొందుతాననే ఆశ ఉన్నవాడిని''

''మీకు నేనెలా తెలుసు?'' కన్నె వయస్సులో తొలిసారి వింటున్న ఆ మధురమైన ఆర్తితో నిండిన మాటలకి మురిసిపోతూ అడిగింది.

''మొదటిసారి మీ కాలేజీ ఏన్యువల్ డేలో మీరు పాట పాడుతున్నప్పుడు చూసాను. పాట, రూపం రెండూ నా హృదయం మీద చెరగని ముద్ర వేసాయి. అంతే నా నిద్ర పోగొట్టుకున్న మొదటి రాత్రి అది. నేటివరకూ నిద్ర ఏమిటో మరిచిపోయాను. మీ ఊహల్లో పడితే ఒక్కోసారి ఏది పగలో ఏది రాత్రో కూడా తెలియనంత మత్తెక్కిపోతుంది..ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్..మనం ఐదారుసార్లు కలుసుకొన్నాం. అందులో మూడు సార్లు మాట్లాడుకున్నాం''

విస్మయం చెందింది వినత.

''అంటే నేను మిమ్మల్ని చూసానంటారా?''

''అఫ్‌కోర్స్...ఒకానొక సందర్భంలో నన్ను అప్రిషియేట్ చేసారు కూడా''

''వాటె వండర్! ఎనీ హౌ..ఇప్పుడు మీరెందుకు ఫోన్ చేసినట్లు?''

శివల పద్మ

''అదేంటండీ అలా అంటారు? భక్తుడుకి దేవత మాటలు వినే అవకాశం వస్తే ఆగగలడా?''

''చాలా పాత డైలాగు'' మురిపెంగా నవ్వు దాచుకుంటూ అంది.

''భావం ఒకటే అయినప్పుడు డైలాగ్ పాతదైతేనేం..కొత్తదైతేనేం?''

''నా కాలేజీకి టైమ్ అవుతోంది''

''నాకు తెలుసు..మరి మీ దర్శనభాగ్యం నాకెప్పుడు? అదే మనసారా నా మనస్సు తెలియచేసుకునేటందుకు..వినతా! ఇలా చెప్తే నీకు నచ్చుతుందో లేదో తెలియదు కానీ నువ్వు లేనిదే నేను బ్రతకలేను'' జాలిగా, వేదనగా 'అలసట(?)'గా విన్పించిన ఆ గొంతుకి చలించిపోయింది వినత. మనిషి దూరాన ఉంటేనేం మమత వెల్లువలా తోంది ఆ మాటల్లో. కానీ ఇతడెవరో తెలియదే...

''వినతా! నిన్ను కలుసుకునే అవకాశం ఇవ్వు...నా విన్నపం విను. కాదనే హక్కు నీకుంది. కానీ ఆ తర్వాత బ్రతికే ధైర్యం నాకు లేదు''

''....''

''ఈరోజు సాయంత్రం ఆరు గంటలకి దుర్గం చెరువు ఎంట్రన్స్‌లో నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను..''

''మిమ్మల్నెలా గుర్తించడం?'' అది వస్తానన్న సంకేతమా?

''నేను మిమ్మల్ని చూసి మీ దగ్గరకు వస్తానుగా...''

''కానీ..ఊహూ..నేను రాలేను..'' కాస్తంత బెట్టు..

''ప్లీజ్..నన్నింకా వేధించకండి..వినతా! ఐ లవ్ యూ డియర్! ఒక్కసారి వస్తే చాలు..నీకిష్టం లేకపోతే ఇంకెప్పుడూ రావద్దు''

''ఊహూ''


''ప్లీజ్''

''సరే..''

★ ★ ★

''హాయ్ ప్రీతీ!''

''హాయ్! ఎప్పుడొచ్చావు ఊరునుంచి?''



''నిన్ననే..నిన్ను ఏకాంతంగా కలుసుకోవాలని తహతహలాడుతున్నాను. పరిచయమై మూడు నెలలే అయినా నువ్వు నాలో సగమైపోయావురా..సాయంత్రం మన టైమ్‌కి వచ్చేయరాదూ..అదే మన ప్లేస్‌కి.. నీ ఒడిలో తల పెట్టుకొని పడుకోవాలని తపించిపోతున్నాను''

''రాకుండా నేను మాత్రం ఉండగలనా? అయినా అంత తపన ఏమిటి? నిన్ను విడిచి నేనెక్కడికి వెళ్లానని?'' లోలోన గర్వపడుతూ పైకి చిన్నగా కోప్పడింది.

''అదంతా నాకు తెలియదు. నువ్వెదురుగా ఉంటే పగలు, నువ్వు పక్కకి వెళితే చీకటి- అది మాత్రమే నాకు తెలుసు..ప్రీతీ! ఈమధ్య నాకెందుకో నేను చచ్చిపోతానేమో అని భయంగా ఉంది''

చప్పున నోరు మూసింది.

''ఛీ...ఏమిటా మాటలు? ఇప్పుడేమైందని?''

''తెలియదు. నీ సహచర్యంలో జీవితంలోని మధురిమ పెరిగే కొలదీ జీవితం ముగిసిపోతుందేమో అనే ఆరాటం...నన్నెందుకిలా పిచ్చివాడిని చేసావు?''

''ఊ..నువ్వు మాత్రం చేయలేదా? నువ్వు దొరికాక అందరికీ దూరమయ్యాను..నువ్వు మాత్రమే నా ప్రపంచం అయ్యావు''

''హౌ స్వీట్! ఒ.కె. ఈవెనింగ్ కలుద్దాం. సరేనా? బై లవ్!''

★ ★ ★

''విజయ్! రేపు నాకు పెళ్ళిచూపులు అవుతున్నాయి''

''ఓ మైగాడ్! సడన్‌గా ఇదేమిటి?''

''సడన్‌గా ఏముందీ? నేను నీతో చెప్పానుగా మ్యాచెస్ వస్తున్నాయని..''

''మరైతే ఇప్పుడెలా?''

''ఇప్పుడైనా వచ్చి మా వాళ్ళతో మాట్లాడు..నేను నా భర్తగా నిన్ను తప్ప ఇంకెవరినీ ఊహించలేను. ఆ పరిస్థితే వస్తే చచ్చిపోతాను'' కళ్ళు కన్నీటి కడవలయ్యాయి!

''ఏయ్ పిచ్చీ! ఏంటిది? నేను బ్రతికుండగా అలా జరగనిస్తానా? నీకేం భయం లేదు..వచ్చే వాళ్ళను రానీ''

''మరి నువ్వెప్పుడొస్తావు?''

''ఇదిగో...ఒక్కసారి మా వాళ్ళతో మాట్లాడనీ..అన్నీ సర్దుకుంటాయి. నాకు మాత్రం బాధగా లేదా చెప్పు. మరి రూమ్‌కి ఎప్పుడొస్తావు? బయట కలుసుకుంటూ ఉంటే నా తనివి తీరడం లేదు. తనువుతో పాటు నిన్ను స్వంతం చేసుకోవాలి''

''ఏయ్..నోర్ముయ్..మతేమన్నా పోయిందా?''

''అరే...అడుగుతున్నది నేనేగా..నీమీద నాకా అధికారం లేదా?''

''ఉంటే మాత్రం? పెళ్ళి కాకముందు ఈ పిచ్చి వేషాలేమిటి?''

''మానసికంగా మనం భార్యాభర్తలం కాదా? మనం గుడికి వెళ్ళినప్పుడు నా చేత నువ్వు బొట్టు పెట్టించుకోలేదా? అదీ దేవుడి ఎదురుగా..''

''విజయ్! అదంతా నిజమే కానీ..ఇది మాత్రం వద్దు..''

''అంటే నా మీద నీకు నమ్మకం లేదన్న మాట..సరే..అలా చెప్పాక ఇక నేను చెప్పేదేముంది? వద్దులే..ధరణీ! నువ్వు నా దానివనుకున్నాను..నా ప్రేమకన్నా నీకు నీ సేఫ్టీ ముఖ్యం...రేపు నేను మోసం చేసి వెళ్ళిపోతానేమో..నీ జాగ్రత్తలో నువ్వుండాలి కదా!''

''విజయ్! ప్లీజ్..అలా మాట్లాడకు. నాకు నీకన్నా నా ప్రాణం కూడా ఎక్కువ కాదు..ఆ విషయం నీకు తెలుసు...''

''మరైతే ఎందుకు భయం? ఈరోజుల్లో టెంత్‌క్లాస్ పిల్లలు కూడా రెండోసారి ఆలోచించడం లేదు. డిగ్రీ చదువుతూ అలా మాట్లాడతావేం?''

''అది కాదు విజయ్! రేపేదైనా జరిగితే''

''ఆ ప్రికాషన్ నేను తీసుకుంటాను కదా!''

''తప్పదా?''

''ప్లీజ్ బంగారూ! ఒక్కసారి తనివి తీరా నిన్ను నాదాన్ని చేసుకోనీ..''

''సాయంత్రం హైటెక్ సిటీ దగ్గర నన్ను పికప్ చేసుకో''

''థాంక్స్..''

★ ★ ★

''వినతా! సాయంత్రం సుధా ఆంటీ నిన్ను బజారుకి సాయం రమ్మంది''

''నేను..నేను మా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళి నోట్స్ తెచ్చుకోవాలమ్మా!''

''మార్కెట్ నుంచి వచ్చాక వెళ్ళొచ్చుగా..ఆరున్నరకి తను వెయిట్ చేస్తానంది''

''ప్లీజ్ మమ్మీ! ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతే కష్టం. రేపు మాకు టెస్ట్ కూడా ఉంది''

★ ★ ★

''ప్రీతీ! వారం రోజుల నుంచి కంటిన్యుయస్‌గా తలనొప్పి వస్తోందే. ఐ టెస్ట్ చేయించుకోమన్నాడా డాక్టర్. మీ కజిన్ ఐ స్పెషలిస్ట్ కదా! ఒక్కసారి వెళ్దామే..'' స్నేహితురాలి విన్నపం!

''ఈరోజు కుదరదే..రేపు వెళ్దామే..''

''వారం రోజులుగా బాధ పడుతున్నానే తల్లీ! ఇవాళ ఏం ముంచుకుపోయే పనులున్నాయి నీకు?'' నిష్ఠూరంగా అంది.

## బన్నీ పెళ్లికొడుకవుతున్నాడు?

**అంతా ముద్దుగా 'బన్నీ' అని పిలుచుకునే అల్లు అర్జున్‌కి 'దేశముదురు' సినిమా కొత్త క్రేజ్ తీసుకొచ్చింది. ఇదే సమయంలో ఓ ఎన్నారై కుటుంబం నుంచి అతనికి పెళ్లి ప్రపోజల్ వచ్చింది. వాళ్లమ్మాయిని పెళ్లి చేసుకోమని వాళ్లడగడం, అందుకు అర్జున్ కుటుంబం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడం జరిగినట్టు వినికిడి. అయితే మరో రెండేళ్ల వరకూ పెళ్లికి దూరంగా వుండాలని అర్జున్ తలుస్తున్నట్టు తెలుసుకున్న ఆ అమ్మాయి తాలూకు అందుకు సరేనని కూడా అన్నారట. అంతే కాదు, అతి త్వరలోనే తమ కాబోయే అల్లుడితో ఓ సినిమా కూడా నిర్మించాలని కూడా ఉద్యుక్తులవుతున్నారని సినీవర్గాల్లో చెప్పుకుంటున్నారు.**



''ఈ ఒక్కరోజు ఓపిక పట్టే రాజీ! రేపు తప్పక తీసుకు వెళ్తానుగా..అంతగా కావాలంటే ధరణితో వెళ్ళి..''

''అయ్యబాబోయ్..నాకు వేరే ముఖ్యమైన పని ఉంది. బహుశా వచ్చేసరికి లేట్ కావచ్చు..'' మధురంగా పలికింది ధరణి గొంతు. కొండంత మత్తు మనస్సంతా నిండిపోయింది అప్పటికే..

★ ★ ★

''హలో వినతగారూ!''

చక్కని సంస్కారం నిండిన గొంతుకి తలతిప్పి చూసింది వినత.

బ్లాకర్ టీ షర్టులో ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి..ఇది వరకు ఎప్పుడో చూసినట్లే ఉంది.

''మీరు...''

''ఎస్..నా పేరు చంద్ర..''

''ఫోన్ చేసింది..'' సంశయంగా చూసింది.

నవ్వాడతను. ''నేనే..రండి అలా కూర్చుందాం..'' అంటూ ఎదురుగా కనిపిస్తున్న సిమెంట్ బెంచ్ వైపు నడిచాడు. తల వంచుకుని అతడిని అనుసరించింది వినత.

అతడినుంచి ఎన్నెన్నో వినాలని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. మరో పక్క మనస్సులో రవంత భయం కూడా ఉంది. అందులోనే ఏదో ఎడ్వెంచర్ చేస్తున్నట్లు థ్రిల్లింగ్‌గా కూడా ఉంది.

''హాయ్ ప్రీతీ! కమాన్..వెయిటింగ్ ఫర్ యు..'' చివ్వున తలెత్తింది వినత.

ఎదురుగా నీలిరంగు చుడీదార్‌లో ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి! తెల్లగా సన్నగా పాలరాతి శిల్పంలా ఉంది. కట్ చేసి జుట్టు భుజాల క్రిందుగా జారుతోంది.

## వాయిదాల 'శివాజి'

***శంకర్-రజనీకాంత్‌ల 'శివాజి' సినిమా రిలీజ్ డేట్ మరోసారి వాయిదా పడుతున్నట్టు చెన్నయ్ సమాచారం. మొదట ఈ సినిమాని ఏప్రిల్ 14న విడుదల చేస్తామనుకున్నారు. కానీ అది వాయిదాపడి మే నెల రెండో వారం అన్నారు. కానీ ఇప్పుడు ఆ తేదీ కూడా మారుతున్నట్టుగా వుందని వినికిడి. జూన్ నెలలో 'శివాజి' విడుదల కావచ్చునేది ఓ టాక్. ఇలా రిలీజ్ వాయిదా వేయడంలోని ఆంతర్యం ఏంటా అనేది అందరి డౌటు!***

''విజయ్!...ఈ అమ్మాయి..'' అనుమానంగా చూసింది.

''వెయిట్..వెయిట్..మరో గెస్ట్ రావాలి. అప్పుడు ఒకేసారి పరిచయం చేస్తాను''

'గెస్టా? ఎవరు?''

''అదిగో రానే వచ్చింది..''

తలతిప్పి అటు చూసిన ప్రీతి ధరణిని చూసి నివ్వెరబోయింది. ఆమెకు నోటి నుంచి మాట రాలేదు.

వినత అయోమయంగా ఈ ముగ్గురినీ చూస్తోంది తప్పితే ఆమెకేమీ అర్థం కావడం లేదు.

''నౌ లెటజ్ స్టార్ట్ అవర్ టాపిక్.. ధరణి అంటే ఈమె నాతో మూడు నెలల పరిచయం- వినతా! ఈమె ప్రీతి. నాతో నెల రోజుల పరిచయం..ధరణీ! ప్రీతీ! ఈమె వినత. కేవలం ఈరోజు పొద్దున్న ఫోన్ చేసాను. సాయంత్రం కలుద్దామని...అంతే సిన్సియర్‌గా వచ్చింది.''

సిమెంట్ బెంచీ మీద వెనక్కి చారబడి కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నాడు.

''మీలో ధరణి ఇంజనీరింగ్ చేస్తోంది. ప్రీతి బియ్యెస్సీ రెండో సంవత్సరం...అండ్ ద గ్రేట్ వినత...ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం..అంటే మొన్ననే హైస్కూల్ దాటి కాలేజ్‌కి వచ్చిందన్నమాట''

''గమ్మత్తేమిటంటే ధరణి, ప్రీతి ఒకే దగ్గర ఉంటారు. ఒకే హాస్టల్‌లో ఒకే రూమ్‌లో ఉంటారు. అయినా మీ ఇద్దరిలో ఒకరికి ఇంకొకరి గురించి తెలుసా? తెలియదు''

అసహనంగా చూసింది ధరణి.

''విజయ్! ఏమిటిదంతా?..సీన్ క్రియేట్ చేస్తున్నావేమిటి?''

హఠాత్తుగా విజయ్ ముఖం ఎర్రబడింది.

తీక్షణంగా ముగ్గురి వైపూ చూసాడు.

''నేను సీన్ క్రియేట్ చేస్తున్నానా? అసలు అంత సీన్ నీకెక్కడ ఉంది? నేను రమ్మన్నది మీ ముగ్గురికీ కంబైన్డ్‌గా ఒక లెసన్ చెప్పాలని..''

వినత ముఖం వెల వెల బోయింది. కళ్ళల్లో నీరు తిరిగింది.

''మీరు ఆడపిల్లలు..ఆధునిక యువతులు..కావలసినంత ప్రపంచ జ్ఞానం పొందేందుకు అన్ని రకాల అవకాశాలు ఉన్నవాళ్ళు..శభాష్! కానీ ఏం చేసారు? ప్రేమ అనే పేరు చెప్పి ఒక మగవాడు పిలవగానే పరుగున వచ్చారు. ఇదీ మీ వ్యక్తిత్వం....'' వ్యంగ్యంగా అన్నాడు.

వినత పైట చెంగుతో కళ్ళొత్తుకుంది.

ప్రీతి ముఖం వివర్ణమైంది. ధరణి ఆలోచిస్తున్నట్లుగా తలదించుకుంది.


''నిజానికి మీకిలా పాఠం చెప్పే అధికారం నాకేం లేదు. కానీ ఎలాగూ వచ్చాను కనుక చెప్పేవెళతాను..

మీరు ఆడపిల్లలైనందుకు మగవాడిని నమ్మడం, మోసపోవడం అనేది మీ జీవితాలకు తప్పనిసరి అని మీరేమైనా ఒక నిర్ణయానికొచ్చేసారా? నాకు తెలియక అడుగుతున్నాను...

మీరు మోసపోవడానికి సిద్ధపడకపోతే ఎవరైనా మిమ్మల్ని మోసం చేయగలరా? అమాయకమైన ఆడపిల్లలు కన్నెపిల్లలు అంటూ రైటర్స్, మీడియా తెగసానుభూతి కుమ్మరిస్తుంటే అందరూ నిజమే అనుకొంటారు కానీ ప్రేమించిన వారిని కలవాలంటే ఎన్నెన్ని రకాల అబద్ధాలు చెప్పాలో అంత బాగా తెలుసున్న మీరా అమాయకులు? కన్నవాళ్ళని, స్నేహితులని మోసం చేయడానికి లేని అమాయకత్వం మీరు మోసపోతేనే వచ్చిందా?

బాయ్‌ఫ్రెండ్‌ని కలవాలంటే ఇంట్లో ఎన్ని అబద్ధాలు చెపుతారో మీకు బాగా తెలుసు. పాతికేళ్ళు పెంచిన కన్నవాళ్ళ దగ్గరే మీరు నిజాలు దాచగలిగినప్పుడు ప్రేమ పేరుతో మిమ్మల్ని లొంగదీసుకోవాలనుకునే మగవాడు మీకెందుకు అబద్ధాలు చెప్పడు? ఎందుకు చెప్పకూడదు? రెండవది- ఉదయం లేచిన దగ్గర్నుంచి మోసపోతున్న ఆడపిల్లలు, ఆత్మహత్యలు చేసుకుంటున్న వాళ్ళు, ప్రాణాలను పోగొట్టుకుంటున్న వాళ్ళు కోకొల్లలుగా పేపర్లనిండా






కన్పిస్తూనే ఉంటారే- అవి చదివి మీరేం తెలుసుకొంటున్నారు? అయినా కొత్తగా మళ్ళీ మోసపోతున్న ఆడపిల్లలు ఎందుకు తయారవుతున్నారు?''

''వాస్తవాలు తెలుసుకునేందుకు- జరుగుతున్న యదార్ధాలను మీ ముందుంచేందుకు అన్ని రకాల సౌకర్యాలు ఈనాడు మీకు అందుబాటులో ఉన్నాయి. కానీ ఏం లాభం? వాటిని మీరెక్కడ వాడుకుంటున్నారు? ప్రేమ అనే రెండు అక్షరాలు వినగానే సర్వం మరిచిపోయే బలహీనతనుంచి ఆడపిల్లలు ఎప్పుడు దూరం అవుతారు?'' కోపంగా వారి ముగ్గురి వైపు చూసాడు.

''ప్రేమ అనేది ఆడపిల్ల జీవితానికి ఎంత అవసరమో మగవాడికే అంతే అవసరం. అలాంటప్పుడు పెళ్ళికాకుండా అవతలివాడు తన శరీరాన్ని కోరుతూ ఉంటే వ్యక్తిత్వం ఉన్న ఆడపిల్ల అయితే చెప్పు తీసుక్కొట్టొద్దా?

నాలుగు సెంటిమెంటల్ డైలాగులు చెప్పగానే తలవంచేయడమేనా? తర్వాత నష్టపోయేది ఎవరు అనే కనీస జ్ఞానం ఉండనక్కర్లేదా? ఇంత వ్యవహారం తల్లితండ్రులకు తెలియకుండా నడపగలరు- మీరు అమాయకులా?

ప్రేమ సక్సెస్ అయితే మీరు చాలా తెలివైన వాళ్ళు కనుక సరైన నిర్ణయం తీసుకున్నారు. అదే ఫెయిలైతే మీరు అమాయకులు కనుక అవతలి వాడు మిమ్మల్ని మోసం చేసాడు. అంతే కదా! బాగుందమ్మా! చాలా బాగుంది.

పైటేయగానే ప్రేమ కోసం పరితపించడం కాదు. చదువుకుంటూ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడం నేర్చుకోండి. ఏనాడైనా మిమ్మల్ని ఓ స్థానంలో నిలబెట్టేది మీ వ్యక్తిత్వమూ ఆలోచనా ధోరణీ, జీవితంలో మీరు సాధించే విజయాలే తప్ప ఈ సెవెంత్ క్లాస్ ప్రేమలూ టెంత్ క్లాస్ గర్భాలూ కాదు.

మనిషిగా జన్మించినందుకు సమాజం పట్ల కొన్ని, జన్మనిచ్చి పెంచినందుకు కన్నవారిపట్ల కొన్ని బాధ్యతలున్నాయి మీకు. మనసుని, ఒళ్ళు దగ్గర పెట్టుకొని కొంచెం జాగ్రత్తగా ఉండండి.

ప్రేమించానని మీ చుట్టూ తిరిగే వాళ్ళని చూసి మురిసిపోవడం మాని వారిని శాసించడం నేర్చుకోండి. ప్రేమ, సెంటిమెంటు, ఉద్వేగాలు మీకు మాత్రమే ఉంటే సరిపోదు. మీతో కలిసి బతికేవాడికి కూడా ఉండాలి. అవి అవతలి వ్యక్తిలో కనిపించనప్పుడు వాడు మిమ్మల్ని వాడుకుంటున్నాడు తప్ప ప్రేమించడం లేదని గ్రహించండి. మోసాన్ని, వంచనని, ధిక్కారాన్ని, అహంకారాన్ని, హింసను మౌనంగా సహించడం మానుకోండి.

'నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? ఫైన్..నా చదువింకా పూర్తి కాలేదు. నీకూ నాకు మనపిల్లలకీ తిండి పెట్టేటంత సంపాదించే స్థితికి నువ్వు చేరుకున్నాక మళ్ళీ నాకు కన్పించు అంతవరకూ ఇటువైపు రాకు' అని చెప్పి చూడండి. సగం మంది మగపిల్లలు మాయం అయిపోతారు.''

ముగ్గురూ నిశ్శబ్దంగా వింటున్నారు. మొదట్లో వచ్చిన కోపం కూడా వారికిప్పుడు లేదు. అతడి మాటల్లోని వాస్తవం వారి హృదయపు లోతులను తాకుతోంది.

''నేనెవరు ఏమిటి అనే విషయాలపై అట్టే ఆలోచన పెట్టుకోకండి. మీలాంటి ఓ చెల్లెకి అన్నను నేను. అంతే. నేను చెప్పినది గుర్తుపెట్టుకుని మసలుకోండి. ఆడపిల్లలుగా కంటే వ్యక్తులుగా ఆలోచించడం, వ్యక్తిత్వంతో బతకడం నేర్చుకోండి. తరతరాలుగా వంచనకే గురి అవుతున్నారంటే- తరతరాలుగా మీ దృక్పథంలో కూడా మార్పు రాలేదన్నది గమనించండి. ముందు దాన్ని మార్చుకోండి. ప్రేమించండి- వద్దనలేదు. కానీ దానికన్నా ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. అంటే ముందు మీ భద్రతను దృష్టిలో పెట్టుకోండి. అవతలి వ్యక్తి నిజంగా మిమ్మల్ని ప్రేమిస్తే మీరు బాధపడే పరిస్థితులను సృష్టించడు. మీరు అవమానపడే పరిస్థితిని తీసుకురాడు. అది గుర్తుంచుకోండి. ప్రేమ పేరు చెప్పగానే నమ్మేసి తల్లిదండ్రులకు దూరం కాకండి. అబద్ధాలతో వారిని మోసం చేయకండి. వారు కొన్నాళ్ళే బాధపడతారు. ఆనక జీవితాంతం బాధపడేది మీరు, వెళ్ళండి..వెళ్ళి బుద్ధిగా చదువుకుని జీవితంలో పైకి వచ్చే ప్రయత్నం చేయండి''

ముగ్గురూ నిశ్శబ్దంగా తలదించుకున్నారు. అతడి మాటలే మనస్సులో ప్రతిధ్వనిస్తుంటే కొద్ది క్షణాలు అదే స్థితిలో ఉండిపోయిన వారికి అతడెప్పుడు వెళ్ళిపోయాడో కూడా తెలియలేదు.

☆

## కొత్తిల్లు కలిసొస్తుందా?

మీరా జాస్మిన్ త్వరలోనే తను ఎంతో ముచ్చటపడి నిర్మించుకున్న అద్భుత భవంతిలోకి మారబోతోందిట. దాదాపు కోటిన్నర వ్యయంతో నిర్మించుకున్న ఈ భవనంలోకి నివాసాన్ని మార్చాక ఆమె కెరీర్ మరో మలుపు తిరుగుతుందేమో! ప్రస్తుతం మలయాళం, తమిళ సినిమాల్లో బిజీగా ఉన్న మీరా జాస్మిన్ తెలుగులో కాస్త వెనకబడిందనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో బాగా లావైన మీరా కాస్తయినా స్లిమ్ అయితేనే నిర్మాతల దృష్టిలోకి రాగలదన్నది సినీ జనాల ఉవాచ.

